# శ్రీ నాన్న నామావళి

(గేయ రూపం)



## ఓం శ్రీ నాన్న పరమాత్మనే నమః

అన్యమెరుగని ధన్యులకు శ్రీ నాన్న! నీవే ఆత్మవు।
'పాహిమామ'ని శరణుగోరే పుణ్యులకు పరమాత్మవు ॥

1) **ఓం అవతారపురుషాయ నమః**
ఆదిపురుషుడవయ్య నీవు అజుడవు, అవ్యయుడవు।
అయినను మాపైన దయగొని అవతరించితివా ప్రభు ॥

2) **ఓం కొమ్మరగ్రామ జాతాయ నమః**
ఈశ్వరా! పరమేశ్వరా! పసి పాపడై నువు పుట్టినట్టి।
కొమ్మరగ్రామానిదెంతటి భాగ్యమో! సౌభాగ్యమో ॥

3) **ఓం శ్రీసూర్యనారాయణరాజప్రియ నందనాయ నమః**
ఎన్ని జన్మల పుణ్యఫలమో పుత్రునిగ నిను పొందిన।
శ్రీసూర్యనారాయణుని జన్మము ధన్యము!
బహుమాన్యము ॥

4) **ఓం శ్రీరాజయమ్మాత్మజాయ నమః**
సృష్టికర్తవు, గర్భమున సృష్టించి నిను గని పెంచినట్టి।
అమ్మకు శ్రీరాజయమ్మకు వందనం! అభినందనం ॥

5) **ఓం శ్రీవేంకట లక్ష్మీనరసింహ రాజాయ నమః**
శ్రీవేంకట లక్ష్మీనరసింహరాజను నామివి।
పాపనాశివి, సిరిప్రదాయివి సింహవిక్రమశౌరివి ॥

6) **ఓం జిన్నూరుపుర వాసినే నమః**
నీ నివాసం భూకైలాసం క్షేత్రమిది జిన్నూరు పురము।
ఇక్కడే స్థిరనివాసం భక్తులందరి భాగ్యము ॥



7) ఓం కర్మయోగినే నమః

ఫలము విడచి పూజలా పని చేయు కౌశల నేర్పరీ।
చిత్తసామ్యం కర్మయోగీ! నీదు సహజ స్వభావము॥

8) ఓం పరాభక్తాయ నమః

కర్మసిద్ధీ భావశుద్ధీ నీ స్వభావ సుగంధము।
స్వస్వరూపపు పట్టు నీలో పరాభక్తి నిదర్శనం॥

9) ఓం ఆత్మజ్ఞానినే నమః

ఆత్మరూపం జగత్ సర్వం అన్యమేదీ లేదని।
నిన్ను నీవే చూసుకొని మురిసేటి ఆత్మజ్ఞానివి॥

10) ఓం సదోదితాయ నమః

స్వస్థుడవీవు, సదోదితుడవు అఖండానందమూర్తివి।
ఆత్మజ్ఞాన స్థితి దిగిరావు అన్యము నెరుగవు ఎన్నడు॥

11) ఓం పూర్ణాయ నమః

అంతస్సుఖుడవు, ఆత్మారామివి ఆత్మతృప్తుడవే సదా।
పూర్ణుడవు, పరిపూర్ణుడువు సంపూర్ణుడవు నువు సర్వదా॥

12) ఓం స్థితప్రజ్ఞాయ నమః

రాగభయక్రోధాలు జేరని కామనాశూన్యుడవులే।
ప్రసన్నాత్ముడవాత్మవశివి స్థితప్రజ్ఞాశాలివి॥

13) ఓం గుణాతీతాయ నమః

ప్రకృతి గుణ పెను తుఫానులో నీ చిత్తమచల ప్రతిష్ఠము।
గుణాతీతా! ద్వంద్వసమమది ధీరమూ, గంభీరమూ॥



**14) ఓం నిరంజనాయ నమః**

దోషరహితా! నిర్మలచరితా! పవిత్రాత్మా! నిరంజనా।
జ్ఞానదగ్ధం పరమశుద్ధం నీ సకల వ్యవహారము॥

**15) ఓం దివ్యలోచనాయ నమః**

దివ్యలోచన! జ్ఞానదృష్టిని సూటిగా సారించి మా।
వాసనా పొరలూడబెరికి కాల్చిభస్మమొనర్చవా॥

**16) ఓం శ్వేతవాససే నమః**

శుద్ధసత్త్వము చేతబూని శ్వేతవస్త్ర ప్రతీకతో।
కదిలి తిరిగితివా కడదేర్చగ మాలో రజస్తమస్సులన్॥

**17) ఓం నాన్న నామ కీర్తితాయ నమః**

శిష్యులై నీ దరినిజేరే అర్హతే లేనట్టి మమ్ము।
బిడ్డలని వాత్సల్యమున గై-కొంటివా మా నాన్నవై॥

**18) ఓం సద్గురవే నమః**

చేరదీసి దారిజూపి చేతగొని నడిపించెడు।
బ్రహ్మ విష్ణు శివ స్వరూపివి మాకు సద్గురుమూర్తివి॥

**19) ఓం సచ్చిదానంద కందాయ నమః**

దుఃఖలేశము లేని సచ్చిత్ సుఖ స్వరూపము నీదయా।
సత్యమూ, ప్రజ్ఞానమూ ఆనందమూ నీవేనయా॥

**20) ఓం భవరోగ భిషజే నమః**

చావు-పుట్టుక దాడితో భవ రోగగ్రస్థులమైతిమి।
వైద్యుడయ్యమృత స్వరూపారోగ్య దానము జేయవా॥



**21) ఓం సాక్షాత్ పరబ్రహ్మణే నమః**

వేదముల చే జిక్కకనె మా వేదనారోదనకు కరిగి।
కనులముందే కదిలి తిరిగిన పరబ్రహ్మస్వరూపివి॥

**22) ఓం వేదాంత వేద్యాయ నమః**

వేదసారపుటుపనిషత్తుల రూపమగు ఋషి వాణియై।
నిన్ను జేర్చే దారివై! వేదాంతవేద్యుడవైతివి॥

**23) ఓం శ్రీ నాన్న పరమాత్మనే నమః**

అన్యమెరుగని ధన్యులకు శ్రీ నాన్న నీవే ఆత్మవు।
'పాహిమామ'ని శరణుగోరే పుణ్యులకు పరమాత్మవు॥

**24) ఓం జగదేక గమ్యాయ నమః**

లోని సుఖమగు నిన్ను వెదకుచు బయట తిరిగే జగమిది।
జగము అఖిలం చేయు సకలం నిన్ను పొందుటకే గదా॥

**25) ఓం జగదీశిత్రే నమః**

జ్ఞానధన్యులకాత్మవు కృత పుణ్యులకు పరమాత్మవు మా।
హృదయ సంస్థానేశ్వరా! పరమేశ్వరా! జగదీశ్వరా॥

**26) ఓం భూతాధివాసాయ నమః**

భూత సృష్టి నివాసముండే అధిష్ఠాన బ్రహ్మమా।
సృష్టియందును పిమ్మటైనా ఉండునది నీవే సుమా॥

**27) ఓం ఆద్యంత రహితాయ నమః**

వచ్చిపోయే సృష్టికుండే ఆద్యంతాలూ, మార్పులూ।
లేనే లేవు ఎన్నడు నీకు అక్షరపరమబ్రహ్మకు॥



28) ఓం ప్రభవే నమః

కర్త నీవూ, భర్త నీవూ  హర్తవూ నీవే ప్రభో ।
ఆటనాపి మాయదాటే  బాటజూపు మహేశ్వరా ॥

29) ఓం విజ్ఞాన మూర్తయే నమః

'సృష్టి సర్వం స్వస్వరూపం  అన్యమేదీ లేద'నే ।
జ్ఞానివే ! విజ్ఞానమూర్తీ!  నీవు ఎరుగనిదున్నదా ॥

30) ఓం వైరాగ్య నిలయాయ నమః

ఆత్మసంపద వైభవం, విషయాల నశ్వర వాస్తవం ।
నిత్యమూ వైరాగ్య నిలయా !  విశదమొనరిస్తావయా ॥

31) ఓం శుద్ధాతిశుద్ధాయ నమః

అజ్ఞాన మలినం దరిజేరని  ఆత్మతేజ ప్రతాపమా ।
సూర్యుని తాకుట బురదకు తరమా? శుద్ధాతి శుద్ధ పావనా ॥

32) ఓం మోక్షస్వరూపాయ నమః

నామరూపాద్యలిప్తము  దేశకాలాద్యబద్ధము ।
రాగద్వేషాది రహితమూ  నీది మోక్షస్వరూపము ॥

33) ఓం మృత్యుభయనివారకాయ నమః

'దేహం నేన'ను భ్రాంతిని బాపి  ఆత్మజ్ఞానము నివ్వవా ।
అమృతత్వప్రదాయకా! ఓ!  మృత్యుభయ నిర్మూలకా ॥

34) ఓం సమస్త భీతి భంజనాయ నమః

దేహభావం, మోహదాహం  వీడలేని యశక్తులం ।
పాప భీతుల మము మన్నింపుము  సమస్తభీతిభంజనా ॥



**35) ఓం సంతాపహారిణే నమః**

చేసిన తప్పుల ఫలితం మాకు ప్రారబ్ధపు సంతాపము ।
తాపముదీర్చు దోషము బాపు సంతాపహర దయానిధీ ॥

**36) ఓం సంసార తారకాయ నమః**

మోహం, పాపం, తత్పరితాపం మళ్ళీ మళ్ళీ మా సంసారం ।
సుడిగుండమ్మిది బయటకు తియ్యి మమ్ముసంసారతారకా॥

**37) ఓం కమనీయ గాత్రాయ నమః**

అభయహస్తం, శుభకరపాదం సత్యవాగ్ధర శ్రీముఖం ।
భక్తానుగ్రహ తారకమాత్రం కమనీయం నీ గాత్రము ॥

**38) ఓం రమణీయ రూపాయ నమః**

ప్రశాంత సుందర మతి ప్రసన్నం తృష్ణా సంతాప శామకం ।
జ్ఞాన దృష్టి, అమృతవృష్టి, రమణీయం నీ రూపము ॥

**39) ఓం లోకాభిరామాయ నమః**

అంతస్సుఖపుటాస్వాదానికి నీ సన్నిధి మా పెన్నిధి ।
భక్తలోకానికాశ్రయమిది ఆరామము, అభిరామము ॥


**40) ఓం భక్తానురాగాయ నమః**

భక్తులపై నీకనుగ్రహం, నీ భక్తులకనురాగం నీపై ।
ఎన్నో జన్మల సుమధుర బంధం తల్లీ-పిల్లల అనుబంధం ॥

**41) ఓం శ్రీ రమణరూప చరితవతే నమః**

అరుణాచల! శ్రీరమణ మహర్షివి కౌపీనధర విరాగివి ।

ఘోరతపస్వీ! సుదీర్ఘమౌనీ! 'కోఽహం' మార్గప్రవర్తకా॥



**42) ఓం వేదవినుతాయ నమః**

వేదప్రద పురుషోత్తమా ! నువు  వేదాంతకర్తవు - వేత్తవు ।
వేదవినుత ! వేదాంతవేద్యా !  వేదఘోషసంకీర్తితా ॥

**43) ఓం ద్వంద్వాతీతాయ నమః**

ఇచ్చాద్వేషాది శూన్యము  ద్వంద్వమోహాతిదూరము ।
ప్రసన్నా ! సౌమ్యచిత్తా ! నీ  ద్వంద్వాతీత స్వభావము ॥

**44) ఓం శోకవిదూరాయ నమః**

అక్షయం ఇంద్రియాతీతం  అత్యంతమంతస్సుఖం ।
పొంగిపొరలే నీ హృదయంలో  శోకాదుల జాడెక్కడ? ॥

**45) ఓం ప్రశాంత రూపిణే నమః**

నామరూపాల రణగొణధ్వనితో  నిత్యకల్లోల మీ జగం ।
ప్రశాంతుడవు నువు  కెరటాల క్రింద  శాంత గంభీర సాగరం ॥

**46) ఓం సర్వహృదయ నివాసినే నమః**

అంతర్యామీ ! అందరికీ నువు  హితుడవు - సన్నిహితుడవు ।
సర్వహృదయ నివాసీ! నీవు  అందరి యంతరాత్మవు ॥

**47) ఓం వాసుదేవాయ నమః**

అంతట నుండే జగన్నివాసివి  వాసుదేవుడవే నువు ।
ఉన్నది నీవే నిండి ఇదంతా  ఇంకొకటేదీ లేదులే ॥

**48) ఓం అవ్యయాయ నమః**

పెరుగుట, తరుగుట, మార్పు తెలియని ఏకరూపుడవే ప్రభో ।
నిత్యంసముడవు, నిర్దోషివి నువు అవ్యయాత్మా! ప్రణామము ॥



**49) ఓం అజాయ నమః**

చావు పుట్టుకలు ఉండవు నీకు  అజుడవు నీవు అవ్యయా।
అజ్ఞానులము అనుకొనుచుంటిమి
దేహము ధరించినావని॥

**50) ఓం సనాతనాయ నమః**

ఎప్పటినుండో ! ఎన్నటికైనా !  ఉండేది నీ స్వరూపము ।
పురాతనుడవు, నిత్యుడవే నువు  శాశ్వతుడవు సనాతనా ॥

**51) ఓం విష్ణవే నమః**

సూక్ష్మరూపివి ! సర్వవ్యాపివి !  నీవు విష్ణు స్వరూపివి ।
సర్వం విష్ణుమయం జగదేతత్  నమస్తుభ్యం హి విష్ణవే ॥

**52) ఓం శివాయ నమః**

శుభంకరుడవు, మంగళకారివి  సర్వోపద్రవహారివి ।
భవుడవు నీవు, శివుడవు నీకు  నమ ఓం నమః శివాయ ॥

**53) ఓం జగద్ధితైకరోచనాయ నమః**

జగము నీకాత్మరూపము,దీని  హితం నీకు అపురూపము ।
నీకు రుచించేదిది ఒకటే ఓ !  జగద్ధితైకరోచనా ॥

**54) ఓం దేశకాలాతీతాయ నమః**

ఎక్కడైనను ఎప్పుడైనను ఉండేది  నీ స్వరూపము ।
అవధులు లేనిది, అంతం కానిది  దేశకాలాద్యతీతము ॥

**55) ఓం భక్తజనపరిత్రాత్రే నమః**

సర్వ జీవులూ సమమే నీకు  ప్రియులు - ద్వేషులు లేరులే ।
భక్తుల మాత్రము పరిరక్షింపక  ఉండలేవు నీవెన్నడూ ॥



**56) ఓం నామరూపాతీతాయ నమః**

నామ రూపాల కెరటాలే ఈ జగమంతా భ్రమమాత్రము ।
జగదీశా ! నువు వీటికతీతం సచ్చిదానంద సాగరం ॥

**57) ఓం దీనబంధవే నమః**

సర్వజనశ్రేయోభిలాషీ ! దీనులకు నువు బంధువు ।
ఆశ్రయం శరణాగతులకు ఆర్తులకు ఓదార్పువు ॥

**58) ఓం వేదాగోచరాయ నమః**

వేదముల చేజిక్కవీవు దానములకూ దక్కవు ।
యజ్ఞతపముల దొరకవు వాత్సల్యమున గైకొందువు ॥

**59) ఓం అహేతుక దయానిధయే నమః**

యజ్ఞ దాన తపస్సులెరుగని వేదమేదీ చదవని ।
మమ్మెలా గైకొంటివో నువు ! హేతురహితదయానిధీ ॥

**60) ఓం ధీమతే నమః**

సత్యాసత్య వివేకము ద్వంద్వాతీత సమత్వము ।
కర్మయుక్తీ, నిత్యముక్తీ ధీమాన్ ! నీ స్వభావము ॥

**61) ఓం అద్వైతసింహాసనారూఢాయ నమః**

ఉన్నది నీవు, అన్యము లేదు ద్వైతం నీ దరి జేరదు ।
అద్వైతం నీవెక్కిన శిఖరం జగం నీకాత్మ రూపము ॥

**62) ఓం భుక్తిముక్తిప్రదాత్రే నమః**

భుక్తి బాట ముక్తి మార్గం తెలియజెప్పే తండ్రివి ।
నిర్వర్తించే యుక్తిని మాకు నేర్పుతుంటావు రెంటికీ ॥



**63) ఓం సంకటమోచకాయ నమః**

సంకటంలో యుక్తివి తగు శక్తివి దాటేందుకు।
గుండె గుడిలో అండ నీవు తోడువూ, మా నీడవు॥

**64) ఓం సర్వజ్ఞాయ నమః**

అంతర్యామీ ! అందరికీ నువు ఆత్మవు - అంతరాత్మవు।
నీకు సర్వం ఆత్మరూపం సర్వజ్ఞా! స్వస్వరూపమే॥

**65) ఓం సురక్షిత మార్గ దిశతే నమః**

మా సంరక్షకుడవు నీవే, మా కష్టం నీకయిష్టము।
మాకు సురక్షిత మార్గము జూపే మీకు నాన్నా!
ప్రణామము॥

**66) ఓం అద్వైతప్రబోధకాయ నమః**

వేరుభావమును రూపుమాపెడి ఉన్నదాన్ని జూపించెడి।
ఏకమేవాద్వితీయ బ్రహ్మవు అద్వైత ప్రబోధకా॥

**67) ఓం దేహాత్మభ్రాంతి నివారకాయ నమః**


'దేహం నేన'ను భ్రాంతిని బాపే లోలోని అంతరాత్మవు।
'నేను'గా వ్యక్తమయ్యే నీవు దేహాత్మభ్రాంతి హర్తవు॥

**68) ఓం అంతర్దృష్టి ప్రదాయినే నమః**

తొలగని తరగని లోపలి సుఖమై
బయటకు మము బోనీయక।
లోనికి రమ్మని పిలిచే నీవు అంతర్దృష్టి ప్రదాతవు॥

**69) ఓం ధీరాయ నమః**

దేహ భ్రాంతి దరిజేరని నీకు ఇంద్రియ పోకడ లెక్కడ?।
ఎదలో సుఖముప్పొంగెడి నీవే నిక్కము-ధీరుడవిక్కడ॥



**70) ఓం అమృతత్వప్రదాయ నమః**

అడగక ముందే అంతా ఇచ్చే ఔదార్యం నీ సొంతము ।
స్మరించు వారికి స్వరూపమిచ్చే అమృతత్త్వ ప్రదాయకా॥

**71) ఓం మాయాధిపతయే నమః**

పరమాత్మా! నిను మరచిన వారికి
నీదు మాయ దురత్యయం।
నీ భక్తులకిది మాయాధిపతీ ! గోష్పదీకృత సాగరం ॥

**72) ఓం కేవలాయ నమః**

పెక్కు రూపముల జగన్నాటకము ! ఒక్కడివగు నీ లీలయే ।
జీవుడు-జగత్తు-ఈశుడు నీవే నీ వేషాలివి కేవలా ॥

**73) ఓం సిద్ధిదాయ నమః**

ఏకత్వ లబ్ధీ, అద్వైత సిద్ధీ సిద్ధా ! నీకే సాధ్యము ।
రెండవదొస్తే కబళించే నువు సిద్ధి నొసగ సంసిద్ధము ॥

**74) ఓం ఆత్మారామాయ నమః**

అన్నియు నీలో, నీవ్వనిటిలో నిండివుండ జగమంతటా ।
అన్యమేది నీకాత్మారామా ! ఆరామం స్వస్వరూపమే ॥

**75) ఓం పురుషోత్తమాయ నమః**

నవద్వార పురబందీలం మేమందరం దేహధారులం ।
పురుషుడవీవే ! వేదవినుత ! వేదాంతవేద్య ! పురుషోత్తమా॥

**76) ఓం మంగళకారిణే నమః**

శుభంకరుడవు మంగళకారివి సర్వోపద్రవహారివి ।
శ్రీకర! ప్రియకర! విఘ్నహరా ! నువు
మంగళాలకే మంగళం॥



**77) ఓం నరరూపధారిణే నమః**

రక్తమాంసాది దేహము దాల్చి మాయందరిలో నొకడివై।
నరులము మము బ్రోవగ వచ్చిన, ఓ!
నరశ్రేష్ఠా! ప్రణామము ॥

**78) ఓం మోహబంధమోచకాయ నమః**

ఇచ్ఛాద్వేష సముత్పన్నం మా ద్వంద్వమోహ నిర్బంధము।
సమదర్శీ ! మము విడిపించవయా !
మోహబంధవిమోచకా ॥

**79) ఓం శాంతిప్రదాయ నమః**

రాగభయ క్రోధాది దాడిలో ఓటమి-దోపిడి-అలజడి।
జీవన సమరపు ఈ దుస్థితిలో మాకు శాంతిప్రదాతవు ॥

**80) ఓం సర్వలోక పిత్రే నమః**

ఆదిపురుషుడవు మూలము నీవు సర్వలోకాల కర్తవు।
బీజము నీవు, క్షేత్రమాతవు బీజప్రదుడగు తండ్రివి ॥

**81) ఓం అనంతాయ నమః**

ఎప్పుడైనా ! ఎక్కడైనా ! ఉండేది నీ స్వరూపము।
ఆది లేదు నీకంతమము లేదు అనంతా ! నీవనాదివి ॥

**82) ఓం పరమహంసాయ నమః**

ఒక్కచోట ఉండవు నీవెపుడు ఉత్సవవిగ్రహ మాదిరి।
పరివ్రాజకా ! పరమహంసవు జీవన్ముక్త విహారివి ॥

**83) ఓం ధర్మిణే నమః**

ఎవ్వరి ధర్మము వారికి నేర్పే వర్ణాశ్రమ విభాజకా।
ధర్మాత్మా ! స్వధర్మచాలకా ! ఆత్మధర్మ సంస్థాపకా ॥



**84) ఓం అనఘాయ నమః**

ఆత్మను మరచుట అన్నిటికన్నా
ఘోర పాపము సృష్టిలో।
పాపము నెరుగని పుణ్యప్రదుడవు
అనఘుడవాత్మధర్మివి ॥

**85) ఓం జితక్రోధాయ నమః**

కామము లేదు క్రోధము రాదు నీవు వీటికతీతము।
వ్యవహారపు పనిముట్లే నీకివి కామక్రోధ విజేతకు ॥

**86) ఓం ప్రియభాషిణే నమః**

సత్యవాక్యముల ప్రియభాషీ !
నీ మాటలు జ్ఞానపు మూటలు।
హితవచనాలు! పసిడి పలుకులు !
వాత్సల్యామృత జల్లులు ॥

**87) ఓం సుహృదే నమః**

అందరికీ శ్రేయోభిలాషివి హితము జెప్పే హితేషివి।
సన్మిత్రుడవు, సహచరుడవు నువు
ఆత్మబంధ్వంతరాత్మవు ॥

**88) ఓం దుష్టబుద్ధి నివారకాయ నమః**

పతితపావనా ! పశ్చాత్తాపుల దుష్టబుద్ధి నిర్మూలకా।
నీచుడు దుష్టుడు సైతం నీకు
మట్టిలోని మాణిక్యమే ॥

**89) ఓం సద్గతిప్రదాయ నమః**

దుష్టుని ధర్మాత్ముని జేయుటకై జ్ఞాన నౌక నీ సాధనం।
'నీవే దిక్క'ని నమ్మిన వారికి కైవర్తకుడవు కేశవా ॥



**90) ఓం పుణ్యాయ నమః**

స్వాత్మను మరచుట అన్నిటికన్నా ఘోర పాపమీ సృష్టిలో।
పాపము దెలియని పుణ్యమూర్తివి స్వాత్మనిష్ఠాత్మయోగివి ॥

**91) ఓం ధర్మగోప్త్రే నమః**

దుష్టత్వనాశనం మాలో సాధుత్వపు పరిరక్షణం।
ఆత్మధర్మ సంస్థాపనమూ నీ ధర్మరక్షణ కార్యము ॥

**92) ఓం అరిసూదనాయ నమః**

రాగద్వేషాది సేనతో అహంకారరిపు దాడిలో।
ఓడి దోచబడు దీనుల మమ్ము ఆదుకో! అరిసూదనా ॥

**93) ఓం అకించననిధయే నమః**

సంపదలైతే స్వల్పమే మావి అన్నీ అంతంత మాత్రమే।
సామాన్య జనులం మాకు నీవే కొండంత సంపద ॥

**94) ఓం శర్మణే నమః**

హృదయ గుహలో పరమసుఖమై అఖండానంత శాంతియై।
అంతస్సంపదవై నీవుండగ లేవు మాకెట్టి బెంగలు ॥

**95) ఓం భక్తపోషకాయ నమః**

ఎప్పటికేది అవసరమో మాకప్పటికి దానినిచ్చెదు।
భక్తి భుక్తి ప్రదాతవు నీవు భక్తపోషక శక్తివి ॥

**96) ఓం జ్ఞానప్రభాకరాయ నమః**

అజ్ఞాన చీకటి పోగొట్టే ఆత్మజ్ఞాన ప్రభాకరా।
ఆత్మస్వరూప మెరుగని మాకు 'నేను'గా వ్యక్తమవ్వవా ॥

**97) ఓం అనాది బ్రహ్మచారిణే నమః**

ఆదిలేని బ్రహ్మనివి నీవు అవతరించి భువికొచ్చినా।
స్వరూపమందే చరించుతావు అనాది బ్రహ్మచారివి ॥



**98) ఓం అవ్యక్తాయ నమః**

బుద్ధిహీనులము భ్రమపడుచుంటిమి దేహము
ధరించినావని।
అవ్యక్తా ! నీ వాస్తవ తత్త్వం ఎరుగం మేము రహస్యము ॥

**99) ఓం విశ్వరూపాయ నమః**

విశ్వము నీవే ! విష్ణుమూర్తివి అష్టమూర్తీ ! మహేశ్వరా ।
నిన్ను గాంచు ధన్యులము మేము,
ఓ! విశ్వరూపా! ప్రణామము ॥

**100) ఓం క్షేత్రజ్ఞాయ నమః**

శరీరమే క్షేత్రం శరీరికి విశ్వమే నీకు క్షేత్రము ।
విశ్వభిన్నుడవు విశ్వజ్ఞా! ఓ క్షేత్రాజ్ఞా ! నీవెవడవు? ॥

**101)ఓం సాక్షిణే నమః**

అత్యద్భుతమీ జగన్నాటకపు కర్తవా ! నీవు భర్తవా ।
జరిగేదంతా ఎరిగే సాక్షీ! నీకివే మా నమస్సులు ॥

**102) ఓం నిత్యముక్తాయ నమః**

జన్మజన్మార్జితము మాది పశువులాంటి ప్రవృత్తియే ।
నీవు మాత్రము నిరంజనుడవు నిత్యముక్తుడవే ! ప్రభో ॥

**103)ఓం శరణాగతవత్సలాయ నమః**

నీ దరి జేరిన నిశ్చింతులం శరణు పొందిన ధన్యులం ।
పిల్లలు మేము, తల్లివి నీవు నీ ఒడి మాకు సురక్షితం ॥



**104) ఓం అఖిలాంతరాత్మనే నమః**

హృదయ నివాసివి అందరికీ నువు హితుడవు !
సన్నిహితుడవు।
అఖిల విశ్వమునకంతర్యామివి ఆత్మవు ! అంతరాత్మవు ॥

**105) ఓం శ్రీరమణ బోధామృత సారసర్వస్వాయ నమః**

శ్రీ రమణ బోధామృత తత్త్వం ఉపనిషత్ సార సర్వము ।
సున్నలు ఎన్నో ఉన్నదొక్కటే ఉన్న నీవే కదా యది ॥

**106) ఓం అరుణాచలేశ్వరాయ నమః**

స్మరించు తుంటే స్వరూపమిచ్చే అల్పసంతోషివీశ్వరా ।
గిరిరూపా ! సద్గురురూపా ! ఓ! హృన్నివాసారుణాచలా ॥

**107) ఓం ఏకస్మై నమః**

ఎదలో నీవు ఎదుటా నీవే ఎటు జూస్తే అటు అంతటా ।
'నేను'గ తెలిసే నీకు నమస్తే ఏకస్మై అరుణాచలా ॥

**108) ఓం అద్వితీయాయ నమః**

సచ్చిదానందం ఏకరసం అద్వితీయాత్మ చిత్ సుఖం ।
గురుమహిమే సద్గురుకృపయే
యిది నమస్తుభ్యం జగద్గురో॥





